
చెరువులకు మహర్దశ



ఇది కదా అభివృద్ధి

అక్కిరెడ్డిపాలెం చెరువు
విస్తీర్ణం : 2 ఎకరాలు
రూ. 1.48 కోట్లు

మింది రాంనగర్ చెరువు
16 ఎకరాలు
రూ. 45 లక్షలు

కృష్ణ మహంతి చెరువు
17 ఎకరాలు
రూ. 2 కోట్లు

- కబ్జాకు చెక్ పెడుతూ పటిష్టంగా రక్షణ
- వాకింగ్ ట్రాక్ నిర్మాణం, సుందరీకరణపై దృష్టి
- ఆహ్లాదకర వాతావరణం కల్పించడంపై స్థానికుల హర్షం

చెరువుల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించింది. కోట్ల రూపాయలతో చెరువులను సంరక్షించడంతో పాటు వాటి సుందరీకరణకూ ప్రాధాన్యం ఇస్తోంది. జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో నక్కల చెరువు, మింది రాంనగర్ పక్కనున్న చెరువు, 69వ వార్డు కృష్ణ మహంతి చెరువులకు సంబంధించిన పనులు చురుగ్గా సాగుతున్నాయి. దశాబ్దాలుగా ఎన్నో ప్రభుత్వాలు వచ్చినా..చెరువుల సంరక్షణపై ఏ ఒక్కరూ దృష్టి సారించలేదని.. ప్రస్తుత ప్రభుత్వం ప్రతీ అంశంపైనా ప్రత్యేకంగా దృష్టి పెడుతూ, చెరువులను ఆహ్లాదకర వాతారణంలో అభివృద్ధి చేయడం అభినందనీయమని ప్రకృతి ప్రేమికులు, ఆరోగ్యాభిలాషులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



అభివృద్ధి చేస్తున్న మింది రాంనగర్ చెరువు

అక్కిరెడ్డిపాలెం: నగర పరిధిలో చెరువులు క్రమేపీ కనుమరుగవుతున్న తరుణంలో వాటి సంరక్షణకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. నియోజకవర్గ పరిధిలోని 68, 69 వార్డుల్లో మూడు చెరువుల అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. గవర్నమెంట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఎంఏ అండ్ యూడీ విభాగం, ఏపీ గ్రీన్ కార్పొరేషన్, జీవీఎంసీ సంయుక్తంగా ఈ పనులు చేపడుతున్నాయి.

అక్కిరెడ్డిపాలెం చెరువు అభివృద్ధి ఇలా..

68వ వార్డు పరిధి అక్కిరెడ్డిపాలెంలోని 2 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించిన నక్కల చెరువును రూ.1.48 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేస్తున్నారు. చెరువు చుట్టూ రిటైనింగ్ వాల్ నిర్మాణం , చెరువు చుట్టూ ఐరన్ జాలీ, వాకింగ్ ట్రాక్, ఎల్ఈడీ లైటింగ్, గ్రీనరీ, సేద తీరేందుకు సిట్టింగ్ బెంచీలు నిర్మిస్తున్నాయి. ఇప్పటికే 40 శాతం పనులు పూర్తి కాగా.. మిగిలిన పనులు చకచకా జరుగుతున్నాయి.

మింది రాంనగర్ చెరువు సుందరీకరణ

మింది రాంనగర్ చెరువు 16 ఎకరాల్లో విస్తరించగా చెరువు సుందరీకరణ పనులు ప్రారంభమయ్యాయి. రూ.45 లక్షలు నిధులు మంజూరు కావడంతో చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మించారు. చెరువు అభివృద్ధికి ఇంకా నిధులు అవసరం కావడంతో పనుల్లో కొంత జాప్యం జరుగుతోంది.

రూపు మారనున్న కృష్ణమహంతి చెరువు

69వ వార్డులో 17 ఎకరాల్లో విస్తరించిన కృష్ణ మహంతి చెరువు అభివృద్ధికి రూ.2 కోట్లు నిధులు మంజూరయ్యాయి. అభివృద్ధి పనుల్లో భాగంగా ఇప్పటి వరకు చెరువులో పూడికతీత చేపట్టారు. చుట్టూ మట్టితో వాకింగ్ ట్రాక్ నిర్మాణం అయింది. ఏపీ గ్రీనరీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కృష్ణమహంతి చెరువు బ్యూటిఫికేషన్ పనులు చేపడుతున్నారు.



అక్కిరెడ్డిపాలెం చెరువు చుట్టూ నిర్మించిన రిటైనింగ్ వా



అక్కిరెడ్డిపాలెం చెరువు వద్ద నిర్మిస్తున్న వాకింగ్ ట్రాక్



నాతయ్యపాలెం కృష్ణమహంతి చెరువు వద్ద వాకింగ్ ట్రాక్ నిర్మాణం

చెరువుల అభివృద్ధిపై దృష్టి



అక్కిరెడ్డిపాలెం, మింది, నాయ్యపాలెం చెరువుల అభివృద్ధి, సుందరీకరణ పనులు వేగంగా జరుగుతున్నాయి. నిధుల జాప్యంపై అధికారులతో సమీక్షిస్తున్నాం. పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం.

– పి.సింహాచలం, గాజువాక జోనల్ కమిషనర్

ఇంత అభివృద్ధి.. నిజంగా అద్భుతం



అక్కిరెడ్డిపాలెంలో ఒకప్పుడు నక్కల చెరువు అంటే కేవలం నక్కల సంచారంతో ఉండేదంట. ఇప్పుడు చెరువు అభివృద్ధి చూసి నమ్మలేకపోతున్నాం. ప్రతీ అంశంపైన ప్రభుత్వం దృష్టి సారించడం ఆనందంగా ఉంది. వాకింగ్ ట్రాక్, సిమెంట్ బెంచీలు, జాలీ.. అన్నివిధాల ఎంతో బాగుంది. పనులు పూర్తయిన తర్వాత అద్భుతంగా ఉంటుంది.

– పసుపులేటి హరిబాబు, అక్కిరెడ్డిపాలెం

గట్టు వద్ద సేద తీరితే ఎంతో హాయి



చెరువు చుట్టూ ఆహ్లాదకర వాతావరణం నెలకొంటోంది. చక్కని వాకింగ్ ట్రాక్ నిర్మించారు. ఈవెనింగ్ వాక్ చేసిన తర్వాత విద్యుత్ కాంతుల మధ్య చెరువు గట్టు వద్ద సేద తీరితే ఎంతో బాగుంటుంది.

– మధు, నాతయ్యపాలెం

క్లుప్తంగా

నేడు లక్ష రుద్రాక్ష పూజ

ఉక్కునగరం: స్థానిక అయ్యప్ప స్వామి దేవాలయంలో శనివారం లక్ష రుద్రాక్ష పూజ నిర్వహించనున్నారు. కార్తీక బహుళ త్రయోదశి సందర్భంగా సాయంత్రం 6.45 గంటలకు పూజ నిర్వహిస్తారు. అయ్యప్ప స్వాములు, భక్తులు పూజలో పాల్గొనాలని ఆలయ ప్రధానార్చకులు నాగేశ్వరశర్మ కోరారు.

నేటి నుంచి సంకల్ప యాత్ర ప్రచారం

డాబాగార్డెన్స్ : జీవీఎంసీ పరిధిలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ప్రచార కార్యక్రమం ఈఈసీ ప్రచార రథం ద్వారా 40 రోజుల పాటు నిర్వహించనున్నామని, దీనిలో భాగంగా తొలి విడత ఈ నెల 9 నుంచి 14 రోజుల పాటు ప్రచారం ఉంటుందని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ పథకాల కింద అర్హులైనప్పటికీ ఇప్పటి వరకు ప్రయోజనం పొందని వారికి సహాయం అందడం, పథకాలపై అవగాహన కల్పించడం, సమాచార వ్యాప్తి, ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో వ్యక్తిగత అనుభవాలు పంచుకోవడం సంకల్పయాత్ర ఉద్దేశమన్నారు. జీవీఎంసీ పరిధిలో 8 జోన్లలో 40 రోజుల పాటు ఈ కార్యక్రమం జరగనుందని కమిషనర్ తెలిపారు.

'యువ కార్మికులకు గ్రేడ్ ప్రమోషన్లు ఆపితే సహించం'

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ యువ కార్మికులకు ఎస్ 3 గ్రేడ్ నుంచి ఎస్ 4 గ్రేడ్ కోసం రాత పరీక్ష, ఇంటర్వ్యూ నిర్వహించడాన్ని స్టీల్ ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్ర రావు వ్యతిరేకించారు. సెంట్రల్ స్టోర్స్ కూడలి వద్ద శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒకవైపు వేతన ఒప్పందం అమలు కాకపోవడం, ప్రొడక్షన్ ఇన్సెంటివ్ తగ్గిపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న యువ కార్మికులను గ్రేడ్ ప్రమోషన్ పేరుతో రాత పరీక్షలు నిర్వహించి మరింత ఒత్తిడికి గురి చేయడం అన్యాయమన్నారు. గ్రేడ్ ప్రమోషన్లు ఆపితే యాజమాన్యం తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో కారు రమణ, బి.ఎస్.రాజు, ఎస్.ఎ.నాయుడు, కొమ్ము ప్రసాద్, ప్రభాకరరెడ్డి, పి.వి.నగేష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు



కబడ్డీ పోటీల పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీజీఎం, నాయకులు

ఉక్కునగరం: కబడ్డీ పోటీలను విజయవంతం చేయాలని స్టీల్‌ప్లాంట్ స్పోర్ట్స్ విభాగం ఇన్‌చార్జ్ సీజీఎం డాక్టర్ కె.హెచ్.ప్రకాశ్ కోరారు. ఈ నెల 9 నుంచి 11 వరకు ఉక్కు త్రిష్ట మైదానంలో నిర్వహించనున్న జిల్లా స్థాయి కబడ్డీ పోటీల పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కబడ్డీ ఆటను ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ పోటీల్లో 28 జట్లు పాల్గోవడం ఆనందదాయకమన్నారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి జె.ఎస్.వి. ప్రసాదరెడ్డి , కె. శ్రీనివాస రావు, రామ్మోహన్‌కుమార్, రేజేటి అప్పారావు, ఉక్కునగరం కబడ్డీ క్లబ్ ఆర్గనైజర్, కోచ్ కె.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు దానప్పతల్లి సారె ఊరేగింపు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు వడ్లపూడి దుగ్గపువానిపాలెం గ్రామంలో దానప్పతల్లి పండగ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం సారె ఊరేగింపు, ముర్రాట మహోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు ప్రారంభమవుతాయని, మధ్యాహ్నం అన్న సమారాధన ఉంటుందని పేర్కొన్నారు. పరిసర గ్రామాల భక్తులు ఊరేగింపులో పాల్గొనాలని కోరారు.

అర్హులందరికీ పథకాలు సీఎం జగన్‌తోనే సాధ్యం

ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి



72వ వార్డులో డిజిటల్ డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

గాజువాక : అర్హత గల ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించే సత్తా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికే ఉందని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని 72వ వార్డు మెహర్‌నగర్ సచివాలయ పరిధిలో శుక్రవారం నిర్వహించారు. సచివాలయం పరిధిలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిని సూచించే డిజిటల్ డిస్‌ప్లే బోర్డును ఈ సందర్భంగా ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ మెహర్‌నగర్ సచివాలయం పరిధిలో డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా ఇప్పటివరకు రూ.18,78,71,478లను సంక్షేమం రూపంలో ప్రజలకు అందించినట్టు తెలిపారు. ఇంతకుముందెన్నడూ ఇంత సమర్థవంతంగా పథకాలు ప్రజలకు అందలేదన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం, వైఎస్సార్‌సీపీ క్లస్టర్ అధ్యక్షుడు రాజాన వెంకటరావు, నాయకులు సిరట్ల శ్రీనివాస్, రెడ్డి జగన్నాథం, ప్రమీల, ఉరుకూటి అప్పారావు, సత్యనారాయణ, ధనలక్ష్మి, విజయ, ఆదిలక్ష్మి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

70వ వార్డులో..

ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని 70వ వార్డు శ్రామికనగర్–4 సచివాలయం పరిధిలో వైఎస్సార్‌సీపీ గాజువాక ఇన్‌చార్జి తిప్పల దేవన్‌రెడ్డి ప్రారంభించారు.



70వ వార్డు కార్యక్రమంలో ప్రసంగిస్తున్న దేవన్‌రెడ్డి

ఆయన మాట్లాడుతూ సచివాలయం పరిధిలో 21,30,78,937 రూపాయలను సంక్షేమం రూపంలో ప్రజలకు అందించారన్నారు. ఈ సందర్భంగా డిజిటల్ డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. కార్పొరేటర్ ఉరుకూటి చందు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జోనల్ కమిషనర్ పి.సింహాచలం, వైఎస్సార్‌సీపీ క్లస్టర్ అధ్యక్షుడు ఎస్ఎండీ గౌస్, నాయకులు నాయుడు, భద్రం, జగన్నాథం, భూషణం , శిరీష, రమణమ్మ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నమ్మకానికి నిలువుటద్దం జగన్

అగనంపూడి: నమ్మకానికి నిలువుటద్దంగా ముఖ్యమంత్రి జగన్‌ను ప్రజలు భావిస్తున్నారని వైఎస్సార్‌సీపీ గాజువాక ఇన్‌చార్జి తిప్పల దేవన్‌రెడ్డి అన్నారు. అందుకే జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ప్రజలు గట్టిగా కోరుకుంటున్నారన్నారు. 88వ వార్డు మంగళపాలెంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. వార్డు సచివాలయం పరిధిలో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలతో రూపొందించిన డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందించారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి గంప్రెడ్డి కనకమహాలక్ష్మినాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు బొడ్డ గోవింద్, జేసీఎస్ అధ్యక్షుడు వాడపల్లి రామచంద్రరాజు, నాయకులు మడక నరసింగరావు, బాబూరావు, వారధి రాజు, చిట్టెమ్మ, శ్యామ్, ప్రమీలారావు తదితరులు పాల్గొన్నారు.



పాల్గొన్న స్థానికులు

76వ వార్డులో..

పెదగంట్యాడ: సంక్షేమ పథకాలు పేదల ఇంట వెలుగులు నింపుతున్నాయని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. 76వ వార్డు బాబూ జగ్జీవన్‌రామ్ కాలనీకి చెందిన పెదగంట్యాడ సచివాలయం–1 వద్ద శుక్రవారం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సచివాలయ పరిధిలో 33కోట్ల 95 లక్షల 96వేల 613 రూపాయలను సంక్షేమం రూపంలో ప్రజలకు అందించారు. సచివాలయ పరిధిలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలను తెలియజేసే డిజిటల్ బోర్డును ప్రారంభించారు. జెడ్సీ సింహాచలం, దొడ్డి రమణ, సీవో సూర్యనారాయణ, మంత్రి శంకరనారాయణ, చిక్కా సత్యనారాయణ, పరంకుశం ప్రమీల, నర్సింహమూర్తి, కాకినాడ పెంటరావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు సంజీవిగిరి కాలనీ, కేవీల్ రావు నగర్‌లలో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారు. సంజీవిగిరి కాలనీలో రూ.19.98లక్షలతో సీసీ రోడ్డు, కేవీల్ రావు నగర్‌లో రూ.22 లక్షలతో తారు రోడ్డు మరమ్మతులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ వార్డులో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా గాజువాక నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని చెప్పారు. వార్డులన్నీ అభివృద్ధి బాటలో పరుగు పెడుతున్నాయన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు, నాయకులు మద్దాల అప్పారావు, లోకనాథం, నాగిశెట్టి శ్రీను, జుత్తు లక్ష్మి, మంత్రి మంజుల, రమణ, పుష్ప, పెంటయ్యరెడ్డి, విఘ్నేష్ పాల్గొన్నారు.

గౌరమ్మకు సారె సమర్పణ

అక్కిరెడ్డిపాలెం: గౌరీ పరమేశ్వరుల మహోత్సవాల్లో భాగంగా గౌరీ సేవా సంఘం ప్రతినిధులు అమ్మవారికి శుక్రవారం సారె సమర్పించారు. అక్కిరెడ్డిపాలెంలోని కుంచుమాంబ, దుర్గమాంబ ఆలయం నుంచి నాతయ్యపాలెంలోని సీఎస్ఆర్ కల్యాణమండపం వరకు సారెను మహిళలు, సంఘం ప్రతినిధులు ఊరేగింపుగా తీసుకువచ్చారు. కార్యక్రమంలో సేవాసంఘం అధ్యక్షుడు దాడి వెంకటరమేష్, ఉపాధ్యక్షుడు కాండ్రేగుల జగ్గప్పారావు, కార్యదర్శి కాళ్ల రాజబాబు, కోశాధికారి భీశెట్టి అప్పారావు పాల్గొన్నారు.



సారె తీసుకువెళ్తున్న గౌరీ సేవా సంఘం ప్రతినిధులు

నేత్రపర్వం.. ఆది దంపతుల కల్యాణం



శివపార్వతుల కల్యాణం జరిపిస్తున్న అర్చకులు


పెదగంట్యాడ: జీవీఎంసీ 75వ వార్డు నెల్లిముక్కులోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో శుక్రవారం శివపార్వతుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, కణితి అప్పలరాజు, పులి వెంకటరమణారెడ్డి, సీమసిరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉక్కు ఉద్యమం భావితరాలకు స్ఫూర్తి

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం కార్మికులు చేస్తున్న ఉద్యమం భావి తరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని ఉక్కు పరిరక్షణ, పోరా ట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 1030వ రోజు, శుక్రవారం సంస్థకు చెందిన వివిధ విభాగ కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొన్నారు.

శ్రీవారి సన్నిధిలో సహస్ర దీపాలంకరణ

ఉక్కునగరం: స్థానిక సెక్టార్–1 వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి సహస్ర దీపాలంకరణ నిర్వహించారు. కార్తీక బహుళ ఏకాదశి సందర్భంగా ఆలయ అర్చకులు భావనారాయణ స్వామి, హరినారాయణ ఆరాధన చేసి, ఉత్సవ విగ్రహాలను మండపంలో అలంకరించారు. దీపాలతో శంఖు, చక్ర, నామాలు, శ్రీచక్రం అలంకరించి, పూజలు చేశారు. అనంతరం భక్తులు అందరూ దీపాలను వెలిగించారు. అంతకు ముందు విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్ సందర్శించిన సీపీ

ఉక్కునగరం: నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ శుక్రవారం స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. సౌత్ ఏసీపీ టి.త్రినాథ్‌తో కలిసి, ఆయన పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. అక్కడ సిబ్బంది వివరాలు, వారు చేసే పనులు తెలుసుకున్నారు. బందోబస్తుకు వెళ్లిన సిబ్బంది గురించి ఆరా తీశారు. రిసెప్షన్, స్టేషన్ రికార్డులను పరిశీలించారు. కేసుల వివరాలు, వాటి రికార్డుల గురించి స్టేషన్ రైటర్‌ను అడిగారు. స్టేషన్ ఆవరణ చుట్టూ పరిశీలించి అక్కడున్న పాత వాహనాలను సాధ్యమైనంత వేగంగా డిస్పోజ్ చేయాలని ఆదేశించారు. అనంతరం ఆయన స్టీల్‌ప్లాంట్ పాత పోలీస్ క్వార్టర్స్ వెనుక ఉన్న వివాదాస్పద ఆరు ఎకరాలను పరిశీలించారు. అక్కడి నుంచి హిల్‌టాప్ గెస్ట్‌హౌస్‌కు చేరుకున్నారు. అక్కడ స్టీల్‌ప్లాంట్ హెచ్ఆర్ సీజీఎం జి.గాంధీ, జీఎం కె.సంజీవరావు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ ఎస్ఐ స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.



స్టీల్‌ప్లాంట్ స్టేషన్‌లో రిసెప్షన్ రికార్డులను పరిశీలిస్తున్న సీపీ రవిశంకర్

క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి

పెదగంట్యాడ: బీజేపీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేయాలని ఆ పార్టీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు సూచించారు. మాజీ కౌన్సిలర్, బీజేపీ 74వ వార్డు అధ్యక్షుడు పేర్ల సత్యారావు ఆధ్వర్యంలో దయాల్‌నగర్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. 11 మందితో బూత్ కమిటీని నియమించారు. కార్యక్రమంలో బొడ్డు రామకృష్ణ, అంజలీదేవి, దేముడు, వరలక్ష్మి పాల్గొన్నారు.